క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ


ప్రత్యేక అలంకరణలో కుమార రామ భీమేశ్వరుడు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో గురువారం భక్తుల రద్దీ పెరిగింది. ఏకాదశి పర్వదినంతో పాటు స్వామి వారి జన్మనక్షత్రమైన ఆరుద్ర కావడంతో తెల్లవారుజామున తొలి అభిషేకం, తొలి పూజలను తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఈఓ డి.నాగమల్లేశ్వర రావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు తొలి అభిషేకం చేసి అనంతరం స్వామి వారికి పిఠాపురం రాజా గోత్రనామాలతో తొలి పూజలు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, భీమన్న, శ్రీకాకుళపు వినయ్‌లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం తరుపున అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

రామలింగేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు


రామలింగేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు చేస్తున్న అర్చకులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో కొలువైన ఉమా రామలింగేశ్వరస్వామికి గురువారం ఫాల్గుణ బహుళ ఏకాదశి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు దత్తులు భక్తులతో మహన్యాస పారాయణం చేయించారు. ఘంటసాల సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో మన్యు పాశుపత ఏకాదశ రుద్రాలతో అభిషేకం నిర్వహించారు. భక్తులు స్వామివార్ని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రావివారిపోడులో ఏకాహం

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడ శివారు రావివారిపోడు రామాలయం వద్ద గురువారం ఏకాదశి సందర్భంగా ఏకాహం నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భజన సమాజ బృందాలు పాల్గొన్నాయి. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత


సూర్యకాంతంకు పింఛను అందజేస్తున్న వలంటీరు మల్లిక

సామర్లకోట: సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా రెండో రోజు గురువారం స్థానిక 7వ సచివాలయం పరిధిలోని కొంకిపూడి సూర్యకాంతంకు కాకినాడ వెళ్లి పింఛన్ అందజేశారు. సూర్యకాంతం అనారోగ్యంతో కాకినాడ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వలంటీరు దువ్వా మల్లిక అక్కడకి వెళ్లి పింఛను ఇచ్చారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

పెద్దాపురం: కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌బండ ధరను పెంచడం అన్యాయమని ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు చింతల సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలను ఆదుకోవాల్సిన పాలకులు గ్యాస్ ధరలు పెంచడం దారుణమన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తాడిశెట్టి గంగాధర్, తాటికొండ వెంకటరత్నం, బైలపూడి రాంబాబు, అనుకుల రమేష్ పాల్గొన్నారు.

శ్లాబు పెచ్చులూడి రోగి బంధువుకు గాయాలు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో సర్జికల్ వార్డు ఎస్ 3లో పెచ్చులూడి పడ్డాయి. ఈ ఘటనలో ఓ రోగి బంధువుకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలిని ఆసుపత్రి అధికారులు పరిశీలించి తక్షణ మరమ్మతులకు ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం వివిధ వార్డుల్లో బలహీనంగా ఉన్న పైకప్పుల భాగాలు, గోడలను నిర్మాణ బృందం పరిశీలించింది. మరమ్మతులు అవసరమయ్యే వార్డులను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించనున్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

- కరోనా అనంతరం మారిన జీవనశైలి
- ప్రజల్లో పెరిగిన ఆరోగ్య స్పృహ
- యోగా, ధ్యానం, ప్రాణాయామాలపై ప్రత్యేక దృష్టి
- ఫ్రూట్స్, డ్రైఫ్రూట్స్‌పై పెరిగిన మక్కువ

పెద్దాపురం: ప్రపంచ దేశాలను వణికించిన కరోనా ప్రజల జీవన విధానాన్నే మార్చేసింది. ఉప్పెనల విరుచుకుపడ్డ కోవిడ్ సెకండ్ వేవ్ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపించింది. ఈ నేపథ్యంలో ఆరోగ్య సంరక్షణపై ప్రజలు దృష్టి సారించారు. ఇప్పుడు ఏ ఇద్దరు కలిసినా ఆరోగ్యం కోసం ఎలాంటి ఆహారం తీసుకోవాలన్న విషయంపైనే చర్చ జరుగుతుంది. పట్టణ ప్రజలు యోగా, ధ్యానం (మెడిటేషన్)తో పాటు శ్వాస వ్యాయామాలు (బ్రీతింగ్ ఎక్సర్‌సైజులు) చేస్తున్నారు. ఊబకాయులపై కరోనా ప్రభావం చూపుతుండడంతో బరువు తగ్గే ప్రయత్నాలు చేస్తున్నారు.

యోగా, ధ్యానంపై ప్రత్యేక దృష్టి

పట్టణ వాసులు ఉరుకులు, పరుగుల జీవన విధానంలో తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. దీంతో మధ్యవయసులోనే మధుమేహం, రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధుల బారిన పడుతున్నారు. వాటి నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యోగా, ధ్యానంపై దృష్టి సారిస్తున్నారు. కొందరు ఇళ్లల్లోనే యోగా, ధ్యానం చేస్తుంటే మరికొందరు శిక్షణ కేంద్రాలకు వెలుతున్నారు. ఊపిరితిత్తులపై కరోనా తీవ్ర ప్రభావం


పులిమేరు యోగాశ్రమంలో ఆసనాలు నేర్పిస్తున్న యోగా గురువు

చూపిన నేపథ్యంలో శ్వాస వ్యాయామాలు చేస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. ఇంట్లోనే రోజూ 10 నుంచి 15 నిమిషాల పాటు శ్వాస వ్యాయామాలు చేస్తున్నారు.

కిటకిటలాడుతున్న వాకింగ్ ట్రాక్‌లు

కరోనా పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ ట్రాక్‌లన్నీ వాకర్లతో కిటకిటలాడుతున్నాయి. వీలును బట్టి ఉదయం లేదా సాయంత్రం కొద్దిసేపు వ్యాయామం చేసేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలోని కాకినాడ గాంధీ నగర్ పార్కు, బోట్‌క్లబ్ పార్కు,


డ్రైఫ్రూట్స్

హెల్త్ చెకప్‌లకు క్యూ

ఒకప్పుడు హెల్త్ చెకప్‌లు చాలా కొద్ది మంది మాత్రమే చేయించుకునే వారు. ఇప్పుడు ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో ఎప్పటికప్పుడు హెల్త్ చెకప్‌లు చేయించుకునేందుకు ఎక్కువమంది క్యూ కడుతున్నారు. కార్డియాక్ హెల్త్ చెకప్, డయోబెటిక్ వంటి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. దీంతో పలు ఆసుపత్రుల లేబొరేటరీలు రాయితీలతో ప్రత్యేక ప్యాకేజీలను ప్రవేశపెడుతున్నాయి.

పెద్దాపురం పట్టణంలో శతాబ్ది పార్కు, సామర్లకోటలోని సీబీఎం కళాశాల మైదానం, పిఠాపురం పార్కుల్లో ఉన్న పలు వాకింగ్ ట్రాక్‌లు వాకర్లతో నిండిపోతున్నాయి. నడక, వ్యాయామం, దేహదారుఢ్యం పెంచుకునేందుకు ప్రతిఒక్కరూ ప్రాధాన్యత నిస్తున్నారు.

పెరిగిన ఫ్రూట్, డ్రైఫ్రూట్స్ వాడకం

శరీరంలోని వ్యాధినిరోధక శక్తిని పెంచుకునేందుకు ప్రజలు ప్రయత్నిస్తున్నారు. దీంతో ఫ్రూట్స్, డ్రైఫ్రూట్స్ వినియోగం గత రెండేళ్లు ఎక్కువైంది. ముఖ్యంగా సీజనల్ ఫ్రూట్స్‌తో పాటు ఆపిల్, కివీ,, ఖర్బూజ, బొప్పాయి, దానిమ్మ వంటి వాటికి గిరాకీ పెరిగింది. కాకినాడ నగరంతో పాటు, జిల్లాలోని పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం, తుని పట్టణాలతో పాటు మండల కేంద్రాలైన జగ్గంపేట, ఏలేశ్వరం తదితర ప్రాంతాల్లో కొత్తగా అనేక డ్రైఫ్రూట్స్ స్టాల్స్ వెలిశాయి. నిత్యం బాదంపప్పు తింటున్న వారి సంఖ్య పెరిగింది. బాదంపప్పు, కిస్‌మిస్, ఖర్జూరం, అంజీరతో పాటు గుమ్మడి, పుచ్చ గింజల్ని ఎక్కువగా తింటున్నారు.

ఆరోగ్యంపై అవగాహన పెరిగింది



ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన బాగా పెరిగింది. చాలా మంది ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. అయితే కొందరు సోషల్ మీడియాలో వస్తున్న వాటిని పాటిస్తూ అనారోగ్యం పాలవుతున్నారు. వైద్యులు సూచించిన పరీక్షలు చేయించుకోవడం మేలు. ఆరోగ్యం కోసం నిత్యం వ్యాయామం, యోగా, ధ్యానంతో పాటు రోగ నిరోధక శక్తిని పెంచుకునేందుకు ఫ్రూట్స్, డ్రైఫ్రూట్స్ తీసుకోవాలి.
– డాక్టర్ ఎస్.సుదీప్తి, ఏరియా ఆసుపత్రి వైద్యురాలు, పెద్దాపురం

జీవనశైలి మార్పుతో వ్యాపార అభివృద్ధి



ప్రస్తుతం ప్రజల జీవనశైలి మార్పుతో డ్రైఫ్రూట్స్ వ్యాపారం అభివృద్ధి చెందింది. కరోనా అనంతరం ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం డ్రైఫ్రూట్స్ బాగా తింటున్నారు. గతంలో కంటే ఇప్పుడు మా వ్యాపారం బాగుంది.
– నరేష్ పెదిరెడ్డి, డ్రైఫ్రూట్స్ వ్యాపారి, పెద్దాపురం

వైభవంగా ముగిసిన అపర్ణాదేవి కల్యాణోత్సవాలు


అపర్ణా సమేత నాగేశ్వరస్వామికి రుద్ర హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో కొలువైన అపర్ణా సమేత నాగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఐదు రోజులుగా కనుల పండువగా నిర్వహించారు. తొలి రోజు అపర్ణా సమేత నాగేశ్వర స్వామి దివ్య కల్యాణం కనుల పండువగా నిర్వహించగా ప్రతి రోజు అర్చకులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆకొండి ప్రభాకర శాస్త్రి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అమ్మవారి దివ్య కల్యాణాల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. గురువారం మహన్యాస పూర్వక మహా రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, రుద్రహోమం, నీరాజన మంత్ర పుష్పం, చతుర్వేద స్వస్తి, ఆశీర్వచనం, ప్రసాద వినియోగం, శ్రీపుష్పయాగం, తెప్పోత్సవం వైభవంగా నిర్వహించి ఉత్సావాలు ముగించారు.

నేత్రపర్వంగా చంద్రశేఖరస్వామికి..

సామర్లకోట: మండల పరిధిలోని పండ్రవాడ గ్రామంలో ఉన్న బాలాత్రిపుర సుందరీ సమేత చంద్రశేఖర స్వామి కల్యాణం గురువారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పాల్గొని స్వామికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, ఎంపీటీసీ నాగనబోయిన చంటి బాబు తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న దవులూరి దొరబాబు తదితరులు

ఉప్పాలమ్మతల్లికి ప్రత్యేక పూజలు

కరప: గ్రామదేవత ఉప్పాలమ్మతల్లి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో ప్రతి గురువారం అమ్మవారికి పూజలు, నైవేద్యాలు సమర్పిస్తున్నారని ఆలయకమిటీ చైర్మన్ చిన్నారి మురళీకృష్ణ తెలిపారు. గ్రామస్తులతో పాటు, పరిసర గ్రామాలవారు ప్రతీవారం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా వేములవాడ సర్పంచ్ కమిడి మంగాదేవి, శంకర దంపతులు ఆ గ్రామానికి చెందిన 101 మంది మహిళలు కలశాల పట్టుకుని, సారె పెట్టి ఊరేగింపుగా మూడు కిలోమీటర్లు పాదయాత్ర చేసి కరప చేరుకున్నారు. అనంతరం దుర్గాదేవి ఆలయానికెళ్లి తర్వాత ఉప్పాలమ్మ ఆలయానికి వెళ్లి కలశాలను, సారెను ఉంచి లలితా నామాలతో ప్రత్యేకపూజలు చేసి, మొక్కులు


ఆలయ మండపంలో కలశాలకు మహిళల పూజలు

తీర్చుకున్నారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు దంపతులు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ మురళీకృష్ణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నక్కా వీరభద్రరావు, చోడపునీడి వెంకటరమణ, పూజా కార్యక్రమాలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.


ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రత్యేకాధికారి ప్రియంవద


లబ్ధిదారులతో మాట్లాడుతున్న నియోజకవర్గ గృహ నిర్మాణ ప్రత్యేకాధికారి ప్రియంవద

పిఠాపురం: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మెప్మా పీడీ, నియోజకవర్గ గృహ నిర్మాణ ప్రత్యేకాధికారి ప్రియంవద అధికారులకు సూచించారు. ఆమె గురువారం గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయం, నగర పంచాయతీ కార్యాలయాల్లో గృహ నిర్మాణాలపై ఆయా సిబ్బందితో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రారంభం కాని ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించేలా చూడాలన్నారు. ప్రారంభించిన ఇళ్లు వెంటనే పూర్తి చేసేలా లబ్ధిదారులకు సహాయ సహకారాలు అందించాలని ఆమె సూచించారు. మెప్మా నుంచి లబ్ధిదారులకు అవసరమైన చేయూత నిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ, ఎంపీడీఓ శర్మ, గృహనిర్మాణ శాఖ అధికారులు, మెప్మా సిబ్బంది, గృహ నిర్మాణ లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు జగన్నాథుడు, సత్యదేవుని కల్యాణాలు


జగన్నాథ స్వామి


సత్యనారాయణ స్వామి

కొత్తపల్లి: మండలంలోని మూలపేటలో కొలువైన జగన్నాథ స్వామి, సత్యనారాయణ స్వామివార్ల దివ్య కల్యాణోత్సవాలు శుక్రవారం రాత్రి నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. శుక్రవారం అంకురార్పణ, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్టాపన, సాయంత్రం గరుడ, గజ వాహన సేవ, స్వామి వారి గ్రామోత్సవం, ఎదురు సన్నాహం, స్వామి వారి దివ్య కల్యాణం, శనివారం ఊంజలసేవ, ఆదివారం సదస్యం, కోలాటం, ప్రత్యేక పూజలు, 6న రథోత్సవం, రాత్రి అన్నసమారాధన, 7న చక్రస్నానం, గ్రామోత్సవం, 8న శ్రీపుష్పయాగంతో కల్యాణ మహోత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు.

పాదగయను దర్శించుకున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పద్మశ్రీ


పద్మశ్రీని సత్కరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: పాదగయ పుణ్య క్షేత్రాన్ని ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆమె కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరిదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ ఎమ్మెల్యే పెండెం దొరబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఆమెను దుస్సాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పదవికి వన్నె తెస్తానని, పార్టీకి పని చేస్తానని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కాకినాడ రూరల్: కాకినాడ బీచ్‌రోడ్డు పాత శిల్పారామం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలం నేమాం గ్రామానికి చెందిన వాసంశెట్టి నాని(30) దుర్మరణం చెందాడు. సర్పవరం పోలీసుల వివరాలు ప్రకారం వాకలపూడిలో సెల్‌ఫోన్ రిపేరు షాపు నిర్వహించే నాని పల్సర్ బైక్‌పై బీచ్‌రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నానికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సోదరుడు లోవరాజు ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. నాని మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

నాచు నివారణకు రసాయనాలు

- విషతుల్యమవుతున్న చెరువులు
- పశువుల తాగునీటికీ నిరుపయోగం
- అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్న రైతులు, స్థానికులు

కొత్తపల్లి: చెరువుల్లో నాచు జాతి మొక్కల నివారణకు కొంతమంది చేపల పెంపకం దారులు రసాయనాలు వినియోగిస్తూ నీటిని విషతుల్యం చేస్తున్నారు. దీంతో కనీసం పశువులు తాగేందుకు కూడా ఆ నీరు పనికిరాకుండా పోతోంది.

మండలంలోని ఎండపల్లి, రమణక్కపేట, కొమరగిరి, ఇసుకపల్లి, కుతుకుడుమిల్లి శివారు పెద్ద కలవలదొడ్డి, వాకతిప్పలలోని చెరువులోని నాచు మొక్కల నివారణకు రసాయనాలు వినియోగిస్తున్నారు. మొక్కలు చనిపోవడమే కాకుండా చెరువులో పెరిగే చేపలపై ఆ విష ప్రభావం ఉందని స్థానికులు చెబుతున్నారు.

నిబంధనలున్నా పట్టింపేది..

పశువులు నీరు తాగే చెరువులు, చేపల పెంపకం చేపట్టే చెరువులో ఎటువంటి రసాయనాలు ఉపయోగించ రాదన్న నిబంధనలు ఉన్నా లీజుదారులు అవేమీ పట్టించుకోకుండా వారిపని వారు చేసుకుపోతున్నారు.


కుతుకుడుమిల్లి శివారు పెద్ద కలవలదొడ్డిలో ఉన్న చెరువులో ఉపయోగించిన రసాయనాలతో ఇలా..


వాకతిప్ప చెరువులో రసాయనాల వినియోగంతో తేలిన తెట్టు

పశువులు నీరు తాగడం లేదు..

చెరువులో నాచు మొక్కలను చంపేందుకు రసాయనాలు జల్లుతుండడంతో పశువులు ఆ నీటిని వాసన చూసి తాగకుండా వెళ్ళి పోతున్నాయని రైతులు చెబుతున్నారు. పొరపాటున తాగిన పశువులు అనారోగ్యం పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రసాయన మందులు వేయొద్దు

చేపల పెంపకం దారులు లీజుకు తీసుకున్న పంచాయతీ చెరువుల్లో ఎటువంటి రసాయనిక మందులు వినియోగించొద్దు. దీని వల్ల నీరు కలుషితమై, అందులోని చేపలు తినడం వల్ల ప్రజలకు కూడా అనారోగ్య సమస్యలు ఏర్పడతాయి. ఇటువంటి వారికి నోటీసులు జారీచేసి వారిపై చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, వాకతిప్ప

చాలా ప్రమాదం



పశువులు తాగే నీటి చెరువులో చేపల వ్యాపారులు నాచు, గడ్డిని తొలగించాలే తప్ప ప్రమాదకర రసాయన మందు చల్లడం దారుణం. పశువులను కడగడానికి కూడా ఈ నీరు ఉపయోగపడదు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.
– జ్యోతుల గోవింద్, రైతు, వాకతిప్ప

కార్యకర్తలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే పెండెం దొరబాబు


రావుల మాధవరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. అనారోగ్యానికి గురై కోలుకుంటున్న సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు జెడ్ఆర్‌యూసీసీ మెంబరు వైఎస్సార్ సీపీ నేత రావుల మాధవరావును ఎమ్మెల్యే దొరబాబు గురువారం పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కౌన్సిలర్ పోశయ్యను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబీ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి పలువురు కౌన్సిలర్లు ఉన్నారు.

సత్తిబాబు కుటుంబానికి ఆర్థిక సాయం


సత్తిబాబు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కొత్తపల్లి: మండలంలోని కొత్తమూలపేటకు చెందిన వంకాయల సత్తిబాబు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. తన కుటుంబానికి గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందజేసారు. పరామర్శించిన వారిలో కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, ఎంపీటీసీ నడింపల్లి సుగుణ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగి దందాపై ఫిర్యాదు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో ఒక కాంట్రాక్టు ఉద్యోగి దందా రోజు రోజుకూ పెరిగి పోతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు గురువారం దీనిపై రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు వద్ద పంచాయతీ జరిగింది. గత టీడీపీ పాలనలో మున్సిపాలిటీ పరిధిలో అనేక మందిని కాంట్రాక్టు ఉద్యోగులుగా నియమించారు. మున్సిపాలిటీ పరిధిలో ఔట్ సోర్సింగ్ పని చేస్తున్న ఒక ఉద్యోగి పట్టణ పరిధిలో వ్యాపారులతో పాటు సినిమా థియేటర్ల వద్ద దందా చేస్తూ పీడిస్తున్నాడని అతనిని తొలగించాలని అధికార పక్ష కౌన్సిలర్లు దొరబాబు వద్ద మొరపెట్టుకున్నారు. అతడిపై పోలీసు కేసు నమోదు చేసి విధుల నుంచి తొలగించాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు దొరబాబు కౌన్సిలర్ల అభిప్రాయాలు సేకరించారు.

రూరల్ ఐసీడీఎస్ సీడీపీఓగా రమణ

సామర్లకోట: రూరల్ ఐసీడీఎస్ సీడీపీఓగా జీవీ రమణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సీడీపీఓగా పనిచేసిన పద్మావతి శంఖవరం బదిలీ కావడంతో ఆమె స్థానంలో తుని రూరల్ ప్రాజెక్టు నుంచి రమణ బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ప్రాజెక్టులోని సూపర్‌వైజర్లు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీడీపీఓను అభినందించారు.

నిరుపేద క్రీడాకారులకు చేయూత

బాలాజీచెరువు: పోలీస్, ఆర్మీ వంటి పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుపేదలకు చేయూత ఇస్తానని హరీష్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్ తెలిపారు. సీలేరు గిరిజన ప్రాంతానికి చెందిన యువతీ యువకులు 20 మందికి గురువారం క్రీడా సామగ్రిని అందజేశారు. అర్హత ఉండీ, సరైన సదుపాయాలు లేక ఉద్యోగాలకు దూరం అవుతున్నారని, అవవసరమైన వారికి తమ ట్రస్ట్ ద్వారా సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు హరీష్ తెలిపారు.